

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



నిర్మల్ కల్చరల్, మే 6 : ఖానాపూర్‌కు చెందిన న్యాయవాదిపై జరిగిన హత్యాయత్నాన్ని న్యాయవాదులు సోమవారం తీవ్రంగా ఖండించారు. విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ... న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి ఓస మహేందర్, ఉపాధ్యక్షులు వైకవితారెడ్డి, అర్చన, శ్యాంసుందర్‌రెడ్డి, నూనె గంగాధర్, రమణారావు, నరేందర్, కే. రమణ, ఉమా, తదితరులు పాల్గొన్నారు.

నాటి వైఫల్యాలే నేటి ప్రచారాస్త్రాలు




పిచ్చి మొక్కలతో నిండిపోయిన కాలువలు



కడెం ప్రాజెక్టు ఇదే

- జిల్లాలో ప్రధానపార్టీల ప్రచారజోరు!
- కేంద్ర ప్రభుత్వ అనుమతుల నిరాకరణ పై నజర్
- నిలిచిపోయిన పథకాలు, అక్రమాలపై విమర్శలు
- బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై ఎదురుదాడి
- దూకుడు పెంచిన కాంగ్రెస్
- దూకుడు పెంచిన కాంగ్రెస్

నిర్మల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల పర్వం ముగియడంతో ఇక అన్ని ప్రధానపార్టీలు తమ ప్రచారంపై దూకుడు పెంచబోతున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఇటు బీజేపీ అటు బీఆర్ఎస్ పార్టీలను లక్ష్యంగా చేసుకొని ఈ ఎదురుదాడి కొనసాగించేందుకు పకడ్బందీ ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగానే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలు, వివిధ సంక్షేమ పథకాలలో జరిగిన అవినీతి అక్రమాలు, భూ కబ్జాలు లాంటి అంశాలను ప్రచారాస్త్రాలుగా మార్చుకోనుంది. ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాల లోపాలు అలాగే నిధులు విడుదల చేయకపోవడంతో నిలిచిపోయిన పథకాలపై కాంగ్రెస్ ప్రచారం చేపట్టబోతోంది. దీంతో పాటు కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలపై కూడా ప్రచారం కొనసాగించనుంది.



కాగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలు, ఉమ్మడి జిల్లాలో చేపట్టిన రోడ్లు, విద్యుత్, హౌసింగ్ లాంటి పథకాలకు అనుమతులు జారీ చేయకపోవడం అలాగే వివిధ కేంద్ర పథకాలను సక్రమంగా అమలు చేయకపోవడం లాంటి అంశాలను అస్త్రాలుగా మలుచుకొని బీజేపీపై ఎదురుదాడి కొనసాగించేందుకు కోసం కాంగ్రెస్ సమాయత్తమవుతుంది. ఇటీవలే జిల్లాలో పర్యటించిన మంత్రి సీతక్కతో ఆయా నియోజకవర్గాల బాధ్యులు సమావేశమై తమ తమ పరిధిలో గతంలో చేపట్టిన పథకాలు అలాగే భూ కబ్జాలు అవినీతి అక్రమాలపై చర్చించారు. వీటన్నింటిని నివేదిక రూపంలో సిద్ధం చేస్తున్నారు. దీనిపై గ్రామస్థాయిలో ప్రజలకు పూర్తిగా వివరించి కాంగ్రెస్‌కు మద్దతు కూడగట్టాలని భావిస్తున్నారు. మంత్రి సీతక్క డైరెక్షన్‌లో నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు, ఆదిలాబాద్ నేత కంది శ్రీనివాస్‌రెడ్డి అలాగే ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు తదితరులు కూడా ఈ వైఫల్యాల జాబితాలతోనే ప్రచారం చేపట్టాలని యోచిస్తున్నారు. ఇటు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గతంలోని పార్టీల వైఫల్యాలను ఒకేసారి ప్రజలకు వివరించి మద్దతు కూడగట్టేందుకు కాంగ్రెస్ నేతలు ఇక రంగంలోకి దిగబోతున్నారు.

నిలిచిపోయిన పథకాలపై..

లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఇప్పటి వరకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం మొదలుపెట్టి నిలిచిపోయిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ టార్గెట్ చేయబోతోంది. ముఖ్యంగా నిర్మల్ జిల్లాలో కాళేశ్వరం 27, 28 ప్యాకేజీ నెంబర్ హైలెవల్ కాలువలు, పూర్తికాని సదర్మాట్ బ్యారేజీ, కడెం ఆధునీకరణకు అలాగే రీడిజైన్ కోసం నిధులు మంజూరు చేయకపోవడం, కాలువల మరమ్మతులకు నిధులు మంజూరు చేయకపోవడం, వరదల కారణంగా కొట్టుకు పోయిన బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టకపోవడం, కుప్టి ప్రాజెక్టు నిర్మాణంపై దృష్టి సారించకపోవడం గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయకపోవడం లాంటి అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లేందుకు కాంగ్రెస్ ఎత్తుగడలు రూపొందిస్తుంది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు సక్రమంగా నిధులు విడుదల చేయకపోవడం అలాగే కొత్త అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించకపోవడం కేవలం అంచనాలు, ప్రతిపాదనలకే పరిమితం కావడం లాంటి వ్యవహారాలపై కూడా కాంగ్రెస్ విరుచుకుపడబోతోంది. ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టకపోవడం, అలాగే చెక్ డ్యామ్‌ల నిర్మాణాలు కేవలం ప్రతిపాదనలకే పరిమితం చేయడం లాంటి అంశాలపై కాంగ్రెస్ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకొని ఎదురుదాడి చేపట్టబోతోంది. ఖానాపూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా చేయకపోవడం, అలాగే ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయకపోవడాన్ని కూడా అక్కడి స్థానిక నాయకులు ఈసారి తమ ప్రచారంలో ఈ అంశాన్ని ఉపయోగించబోతున్నారు. దళిత బస్తీ, దళిత బంధు, బీసీ బంధు లాంటి పథకాలలో జరిగిన అవకతవకలపై కూడా కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయిలో ప్రచారం చేయబోతోంది.

బీజేపీ లక్ష్యంగా..

కాగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జిల్లాకు ఆశించనంతగా నిధులు విడుదల చేయకపోవడం, కొత్త పథకాలకు అనుమతులు జారీ చేయకపోవడం లాంటి అంశాలను కాంగ్రెస్ పార్టీ ఎత్తిచూపబోతోంది. జిల్లాలోని అనేక మారుమూల గిరిజన ప్రాంతాలకు రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణాలకు సంబంధించి కేంద్ర అటవీ పర్యావరణ శాఖ ద్వారా క్లియరెన్స్‌లు జారీ కాకపోతుండడంతో వాటి పనులు చేపట్టలేకపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించకపోవడంతోనే అనేక ఆదివాసి గూడాలు, గిరిజన పల్లెలకు రోడ్డుసౌకర్యం లభించడం లేదని కాంగ్రెస్ ప్రజలకు వివరించబోతోంది. దీంతో పాటు కరెంటు సౌకర్యంపై కూడా కేంద్ర ప్రభుత్వం అటవీ శాఖ ద్వారా అనుమతులు జారీ చేయడం లేదన్న ఆరోపణ లున్నాయి. వీటితో పాటు నిజామాబాద్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు రైల్వేలైన్ ఏర్పాటు అంశంపై కూడా ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం నయా పైసా మంజూరు చేయలేదు. స్థానిక నేతలు గతంలో హామీలు ఇచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా దృష్టి సారించక పోతుండడాన్ని కాంగ్రెస్ తన ప్రచారంలో హైలెట్ చేయబోతోంది.

కాంగ్రెస్‌కు ఊపునిచ్చిన రాహుల్ పర్యటన.

కాగా కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ పర్యటన మరింత కలిసి వచ్చే అవకాశాలున్నాయని అంటున్నారు. రాహుల్ పర్యటన సక్సెస్ కావడంతో కాంగ్రెస్ పార్టీలో కొత్త ఉత్సాహం నెలకొంటోంది. ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ఊపునిచ్చారంటున్నారు. ఇప్పటికే మంత్రి సీతక్కతో పాటు డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జులతో పాటు తదితరులు జిల్లాలో ముమ్మర ప్రచారం కొనసాగిస్తుండగా రాహుల్ జరిపిన పర్యటన ఆ పార్టీకి మరింత ఉత్సాహాన్నిస్తోంది. అదే ఉత్సాహంతో రాబోయే వారం రోజుల పాటు కాంగ్రెస్ పార్టీ వారి ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయబోతోంది. కాంగ్రెస్ పార్టీకి దీటుగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు సైతం తమ ప్రచారాన్ని ముమ్మరం చేయబోతున్నాయి. బీజేపీ ఒకటి రెండు రోజుల్లో పార్టీ అగ్రనేతలను రంగంలోకి దింపే అవకాశాలున్నాయని అంటున్నారు. దీంతో పాటు ఈ నెల 7న బీఆర్ఎస్ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన రోడ్ షోలో పాల్గొనబోతున్నారు.



ఆధ్వాన్నంగా ఉన్న సరస్వతీ కాలువ

ప్రతీ ఒక్కరు ఓటు హక్కు ఉపయోగించుకోవాలి

కుభీర్, మే 6 : ప్రతి ఒక్కరు ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని సోషల్ జస్టిస్‌ఫర్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ కుభీర్ మండల చైర్మన్ సాప పండరి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిగ్రీ విద్యార్థులు సెమిస్టార్ పరీక్షలు జరుగుతుండగా పరీక్ష అనంతరం విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకొని తమ వంతుగా అభివృద్ధి కోసం ఓటు వేయాలని, అదే విధంగా ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.

దళితులను దూషించిన వ్యక్తిపై

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



ఎస్సై సుమాంజలికి ఫిర్యాదు చేస్తున్న దళిత సంఘాల నాయకులు

దిలావర్‌పూర్, మే 6 : సామాజిక మాధ్యమాల ద్వారా దళితులను దూషించిన వ్యక్తిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు సోమవారం దిలావర్‌పూర్ ఎస్సై సుమాంజలికి ఫిర్యాదు చేశారు. దిలావర్‌పూర్ మండలం కదిలి గ్రామానికి చెందిన నార్వాడే శేషారావు అనే వ్యక్తి ఫేస్ బుక్‌లో దళితులను కించపరిచేలా రాయడానికి కూడా వీలుకాని భాషలో అసభ్య పదజాలాన్ని ఉపయోగించి మాట్లాడాడని, వెంటనే అతనిని అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు 24 గంటలలో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలని లేదంటే జిల్లా వ్యాప్తంగా అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఫిర్యాదు చేసిన వారిలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే. వెంకటస్వామి, జిల్లా అధ్యక్షుడు బత్తుల రంజిత్ కుమార్, జైల లింగయ్య, సిపురి సిద్ధార్థ, సప్పల రవి, దయాకర్, రజినేష్, ప్రసాద్, మాణ్యికం, సంజయ్, అంబేద్కర్ సంఘ నాయకులు ఉన్నారు.

లీడర్లు మారినా.. మారని క్యాడర్

- సమీపిస్తున్న పార్లమెంటు ఎన్నికలు

నిర్మల్ కల్చరల్, మే 6 : గత పార్లమెంట్ ఎన్నికలకు ప్రస్తుతం జరిగే ఎన్నికలకు ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో రాజకీయ పార్టీల్లో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. అన్ని పార్టీల్లోని నాయకులు తమకు అనుకూలమైన పార్టీలోకి చేకిపోగా క్యాడర్ మాత్రం పూర్తిస్థాయిలో మారలేదు. ఆయా ప్రాంతాల్లోని నాయకుల పని తీరుపైనే పార్టీల అభ్యర్థుల గెలుపు ఆధారపడింది. ఇక్కడ ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు బరిలో నిలిచారు. అయితే కేంద్రంలోని ఎన్డీఏ ఆదిలాబాద్ స్థానాన్ని సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావుకు కాకుండా బీఆర్ఎస్ నుండి పార్టీలో చేరిన మాజీ ఎంపీ జి. నగేష్‌ను అభ్యర్థిగా నిలిపింది. కాంగ్రెస్ పార్టీ మహిళా అభ్యర్థి ఉపాధ్యాయురాలు ఆత్రం సుగుణను పోటీకి నిలుపగా బీఆర్ఎస్ నుండి ఆత్రం సక్కును అభ్యర్థిగా నిలిపింది. ఈయనకు శాసన సభ్యుడిగా పని చేసిన అనుభవం ఉంది. బీజేపీ అభ్యర్థి నగేష్ గతంలో ఎమ్మెల్యే, ఎంపీగా పని చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి సుగుణ ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి తొలిసారి ఎంపీగా అదృష్టాన్ని పరీక్షించుకుంటుంది. అన్ని పార్టీల్లోని నాయకులు విభేదాలు పక్కనబెట్టి ఎన్నికల్లో అభ్యర్థి గెలుపుకోసం కృషి చేస్తేనే గెలుపు సాధ్యమవుతుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ, కేసీఆర్ ప్రభావం పార్లమెంట్ ఎన్నికల్లో ఏ మేరకు పని చేస్తాయే వేచి చూడాలి.

ఈవీఎంల సప్లమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి : కలెక్టర్




స్ట్రాంగ్‌రూమ్ వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, మే 6 : పార్లమెంట్ ఎన్నికల ఈవీఎంల సప్లమెంటరీ ర్యాండమైజేషన్ పారదర్శకంగా పూర్తి చేసినట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. సోమవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నిర్వహణ, ర్యాండమైజేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈవీఎంల కమిషనింగ్ కాగానే సప్లమెంటరీ ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు చెప్పారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద త్రాగునీరు, టెంట్, బెంచీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్వీప్ ఆధ్వర్యంలో ఓటింగ్‌పై అవగాహన కల్పించి ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం డీఆర్డీవో కార్యాలయం నుండి 5కే రన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. యువత, ప్రజలు పాల్గొనాలని కోరారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్ సందర్శించి ఈవీఎంలను పరిశీలించారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, జీవాకర్, తహసీల్దార్లు, రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఆక్రమించిన లబ్ధిదారులు

- ఖాళీ చేయాలని అధికారుల అల్టిమేటం
- ఎన్ని రోజులు ఎదురుచూడాలని ప్రశ్నిస్తున్న లబ్ధిదారులు

దిలావర్‌పూర్, మే 6 : డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం మూడేళ్లుగా ఎదురుచూసిన లబ్ధిదారులు విసిగి వేసారి పోయి ఇక లాభం లేదంటూ నిర్మాణం పూర్తయిన ఇళ్లను సోమవారం ఆక్రమించారు. దిలావర్‌పూర్ మండల కేంద్రంలో అప్పటి కేసీఆర్ సర్కార్ నీడ లేని నిరుపేదల కోసం 30 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించింది. వాటి నిర్మాణం కోసం దాదాపు నాలుగు సంవత్సరాలు పట్టింది. అయితే ఇళ్ల కోసం దరఖాస్తులు ఎక్కువ రావడంతో డ్రా పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. మిగతా వారికోసం మరో 10 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. ఎంపికైన లబ్ధిదారులు రెండేళ్లుగా ఎదురు చూస్తున్నారు. అయినా ఇళ్లను అప్పజెప్పకపోవడంతో విసిగిపోయారు. సోమవారం ఉదయం లబ్ధిదారులంతా కలిసి ఇళ్లను ఆక్రమించారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ స్వాతి, ఎంఆర్ఐ సంతోష్, ఎంపీవో అజీజ్ ఖాన్ అక్కడికి చేరుకొని లబ్ధిదారులతో మాట్లాడారు. ఇలా ఇళ్లను ఆక్రమించడం చట్టరీత్యా నేరమని, ఇళ్లను వెంటనే ఖాళీ చేయాలని సూచించారు. ఇళ్ల కోసం మేము ఎన్ని రోజులు ఎదురు చూడాలని, రేపు మాపు అంటూ నమ్మిస్తూ వాయిదాలు వేయడం ఎందుకని ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ ఉన్న దృష్ట్యా ఇప్పుడు ఇవ్వడం కుదరదని అధికారులు చెప్పారు. కోడ్ ముగిశాక ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అయినా లబ్ధిదారులు ఖాళీ చేసేందుకు నిరాకరించడంతో ఖాళీ చేసి వెళ్లకపోతే కేసులవుతాయని అధికారులు హెచ్చరించారు. ఎన్నికల కోడ్ ముగిశాక మేమే ప్రభుత్వం దృష్టికి తెచ్చి పంపిణీ జరిగేలా చేస్తామని హామీ ఇచ్చారు. అప్పటి వరకు ఓపిక పట్టాలని సూచించారు. దీంతో లబ్ధిదారులు మెత్తబడ్డారు. సాయంత్రం వరకు ఖాళీ చేసేందుకు అంగీకరించారు. అయితే ఇళ్లను ఆక్రమించిన లబ్ధిదారుల ఆధార్ కార్డుల నెంబర్లను అధికారులు సేకరించడం చర్చనీయాంశమైంది. ఆధార్ నెంబర్ల సేకరణ కేసులు నమోదు చేయడానికేనా అన్న అనుమానాన్ని కొందరు లబ్ధిదారులు వ్యక్తం చేయగా, అలాంటి దేమీలేదని అనుమానం అక్కర్లేదని అధికారులు హామీ ఇచ్చారు.



ఇళ్లను ఆక్రమించిన లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్



అధికారులతో మొరపెట్టుకుంటున్న లబ్ధిదారులు

పార్‌పెల్లిలో ప్రచారం

లక్ష్మణచాంద, మే 6 : మండలంలోని పార్‌పెల్లిలో బీజేపీ నాయకులు సోమవారం ప్రచారం నిర్వహించారు. స్థానికంగా పని చేస్తున్న ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి బీజేపీ అమలు చేస్తున్న పథకాలను వివరించారు. భవిష్యత్తులో అమలు చేయబోయే మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు గోవర్ధన్, అడ్వాల రమేష్, సురకంటి ముత్యం రెడ్డి, అయిండ్ల శ్రీధర్ రెడ్డి, ఓస రాజు, మంతెన చందు రెడ్డి, ఎం. అనిల్, జనార్ధన్, తదితరులు ఉన్నారు.



పార్‌పెల్లిలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

సంక్షిప్త సమాచారం

పోలింగ్ కేంద్రాల వద్ద

మౌలిక సౌకర్యాలు కల్పించండి

నిర్మల్ కల్చరల్, మే 6 : పోలింగ్‌కేంద్రాల వద్ద మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సోమవారం పీఆర్టీయూ జిల్లా నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎండలు తీవ్రమవుతున్నందున ఎన్నికల సిబ్బంది వడదెబ్బకు గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అధ్యక్షుడు వై. సాయన్న, కార్యదర్శి రవి రాజ్, తదితరులు పాల్గొన్నారు.

రిసెప్షన్ కేంద్రాల్లో

కౌంటర్ల సంఖ్య పెంచండి

నిర్మల్ కల్చరల్, మే 6 : ఎన్నికల దృష్ట్యా తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, రిసెప్షన్ కేంద్రాల్లో కౌంటర్ల సంఖ్య పెంచాలని పీఆర్టీయూ అధ్యక్షుడు నరేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి రమణారావు కలెక్టర్‌ను కోరారు. సోమవారం వారు వినతిపత్రం అందజేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలని, కూలర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు ఏఆర్‌వోలకు ఆదేశాలివ్వాలని కోరారు.

మండలంలో పర్యటించిన మాజీ మంత్రి



పరామర్శిస్తున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

లక్ష్మణచాంద, మే 6 : తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, న్యాయ, అటవీ, పర్యావరణ శాఖ మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకులు అలోల్ల ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం మండలంలో పర్యటించారు. రాచాపూర్ గ్రామానికి చెందిన రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకొని ఆయనను పరామర్శించి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లోల సురేందర్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, పాకాల రామచందర్, కేశం రమేష్ యాదవ్, మేకల రాజేందర్, శ్రీకాంత్ యాదవ్, సింగం రాజు, పోశెట్టి, ఇతర కుటుంబ సభ్యులు, మండల నాయకులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు

మాజీ మంత్రి పరామర్శ

నిర్మల్ కల్చరల్, మే 6 : మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం పలు కుటుంబాలను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న అల్లోల గోవర్ధన్ తండ్రిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. రాచాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ గంగారాం, కొండాపూర్ గ్రామం శ్రీచరణ్, మేడిపల్లిలో చిన్నారెడ్డి, సిద్ధిల కుంటలో సాయిరెడ్డి కుటుంబాలను పరామర్శించారు. నాయకులు ఆయన వెంట ఉన్నారు.

వడ్ల కళ్లం కోసం కొత్త మద్దిపడగలో వివాదం

● కళ్లం కోసం భూమిని సిద్ధం చేసుకున్న రైతులను అడ్డుకున్న అటవీ అధికారులు

● గ్రామస్థులకు, అటవీ శాఖ అధికారులకు మధ్య వాగ్వాదం

● నర్సరీ ప్రాంతంలో కాకుండా మరో స్థలంలో వడ్ల కళ్లం కోసం వాడుకోవాలని సూచించిన ఎఫ్ఆర్వో





కొత్త మద్దిపడగ నర్సరీ సమీపంలో గుమిగూడిన రైతులు, అటవీ శాఖ అధికారులు.. కళ్లం కోసం మరోస్థలాన్ని చూపుతున్న ఎఫ్ఆర్వో అనిత, తహసీల్దార్ సుజాత రెడ్డి

ఖానాపూర్, మే 6 : కడెం మండలంలోని కొత్తి మద్దిపడగ గ్రామశివారు ప్రాంతంలో అటవీశాఖ అధికారులకు, గ్రామస్థులకు మధ్య వాగ్వాదం జరిగింది. కొత్త మద్దిపడగ శివారులో ఇటీవల ప్రారంభించిన మైసంపేట్, రాంపూర్ గ్రామం వద్ద సోమవారం తాము పండించిన వరి పంటను ఆరబెట్టుకునేందుకు పంట కళ్లం సిద్ధం చేసుకునేందుకు కొత్త మద్దిపడగ గ్రామస్థులు ప్రయత్నం చేయగా అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. అక్కడ అటవీశాఖ నర్సరీ ఉన్నందున పంటకళ్లం ఏర్పాటు చేయవద్దన్నారు. దీంతో గ్రామస్థులకు,అటవీశాఖ అధికారులకు మధ్య వాగ్వాదం తలెత్తింది. తమకు గతంలో కలెక్టర్ పంట కల్లం కోసం కేటాయించిన స్థలంలోనే అటవీ శాఖ ఆధ్వర్యంలో నర్సరీ ఏర్పాటు చేశారని వెంటనే నర్సరీని తొలగించి తమకు ధాన్యం ఆరబెట్టుకునేందుకు కల్లం కోసం స్థలాన్ని కేటాయించాలని పట్టుబట్టారు. తమ గ్రామ శివారులో ఉన్న ఖాళీ స్థలంలో మైసంపేట్, రాంపూర్ గ్రామాలకు చెందిన ప్రజల కోసం పునరావాస గ్రామాన్ని నిర్మాణం చేశారని ఇప్పుడు నర్సరీ పేరుతో పంట కళ్లం లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా స్థలాన్ని అటవీశాఖ అధికారులు రైతులకు ఉపయోగపడకుండా చేయడం సరికాదని మండిపడ్డారు. దీంతో అక్కడి నుండి వెళ్లిపోయిన ఎఫ్ఆర్వో అనిత ఆ తర్వాత ఆ స్థలానికి తహసీల్దార్ సుజాతతో కలిసి వచ్చారు. నర్సరీ స్థలంలో కాకుండా మరోచోట వడ్లు ఆరబెట్టుకునేందుకు కళ్లం ఏర్పాటు చేసుకోవాలని అటవీశాఖ అధికారులు స్థలం చూపించడంతో రైతులు ఆందోళన విరమించారు.

'ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయం'



పొన్కల్‌లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మామడ, మే 6 : ఆదిలాబాద్ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ భారీమెజార్టీతో గెలవడం ఖాయమని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ధీమా వ్యక్తం చేశారు. మామడ మండలంలో సోమవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మామడ, న్యూ సాంగ్వి, పొన్కల్, నల్దుర్తి, దిమ్మదుర్తి, లింగాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను భారీ మెజార్టీతో గెలిపించాలని, రాహుల్‌గాంధీని దేశ ప్రధానిగా చేయాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామని, ఇప్పుడు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కేంద్రంలో అధికారంలోకి రావడానికి పని చేద్దామని కార్యకర్తలు పిలుపునిచ్చారు. మే13న జరిగే ఎన్నికల్లో హస్తం పార్టీకి ఓటు వేసి పార్లమెంట్‌లో ఆదిలాబాద్ ఎంపీని గెలిపించాలన్నారు. పేదలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఉపాధి హామీ పథకం చట్టం తీసుకొచ్చి 100 రోజులు పని కల్పించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. పది సంవత్సరాలు పరిపాలించిన బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు ఉపాధి హామీ కూలీలను పట్టించుకోలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. కేంద్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుంది. ఉపాధి హామీ కూలీలకు రోజువారీ కూలీ 400ల రూపాయలు చెల్లిస్తుందన్నారు. ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మామడ మండల జడ్పీటీసీ సోనియా సంతోష్, మండల అధ్యక్షులు అమృత జైసింగ్, పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఏనుగు లింగారెడ్డి, మాజీ జడ్పీటీసీ సమీనా రఫీ, మాజీ బ్లాక్ అధ్యక్షులు రమణారెడ్డి, మాజీ సర్పంచ్ బాపయ్య, పడాల శ్రీనివాస్, నర్సారెడ్డి, మంగ లింగన్న, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

భైంసాలో మార్మోగిన ఆంజనేయ నామస్మరణం

● హాజరైన భారత హనుమన్ దీక్షా పీఠాధిపతులు ● భారీ సంఖ్యలో అన్నప్రసాద వితరణ



మాలధారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అఖిల భారత హనుమాన్ దీక్షా పీఠాధిపతి దుర్గాప్రసాద్‌స్వామి

భైంసా, మే 6 : పట్టణంలోని గణేష్‌నగర్ కాలనీ సోమవారం అంజనేయ నామ స్మరణంతో మార్మోగిపోయింది. కాలనీ పరిధిలోని మున్నూరు కాపు కల్యాణ మండపంలో అఖిల భారత హనుమాన్ దీక్షా పీఠాధిపతి దుర్గా ప్రసాద్ స్వామి పర్యవేక్షణలో అర్ధమండల మాలాధారణ, తూమోల్ల ముత్తన్న సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భైంసా డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాలకు చెందిన వేలాది మంది హనుమాన్ దీక్షదారులతోపాటు అంజనేయ స్వామి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా నిర్వహించిన పూజ, భజన కార్యక్రమాల్లో దీక్షదారులు,భక్తులు చేపట్టిన అంజనేయ నామస్మరణంతో గణేష్‌నగర్ కాలనీ మార్మోగిపోయింది. దీక్షదారులు ఆలపించిన ఆంజనేయ గేయాలు భక్తులను విశేషంగా అలరారించాయి. అఖిల భారత హనుమాద్దీక్షా పీఠాధిపతులు దుర్గాప్రసాద్‌స్వామి చేతుల మీదుగా వందలాది మంది మాలధారణ చేపట్టి అర్ధమండల దీక్ష స్వీకరించారు. తూమోల్ల ముత్తన్న సేవా సమితి ప్రతినిధి తూమోల్ల దత్తు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో హనుమాన్ దీక్షదారులతో పాటు భక్తులు భారీసంఖ్యలో పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో భోజనాలు చేస్తున్న హనుమాన్ దీక్షదారులు

బోరిగాంలో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

లక్ష్మణచాంద, మే 6 : మండలంలోని బోరిగాం, బాబాపూర్ గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలను వివరించారు. భవిష్యత్తులో అమలు చేయబోయే పథకాల గురించి తెలిపారు. చేతి గుర్తుకే ఓటేసి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఓడ్నాల రాజేశ్వర్, నాయకులు ఈటెల శ్రీను, గంగాధర్‌గౌడ్, తునికి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్

మే డే ముగింపు కార్యక్రమాలను విజయవంతం చేయాలి : సీఐటీయూ

ఆదిలాబాద్ అర్బన్, మే 6: మే డే వారోత్సవాల ముగింపు కార్యక్రమాలను ఈనెల 7న నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ తెలిపారు. ఉదయం 9గంటలకు జిల్లా కేంద్రంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమై సెంట్రల్ గార్డెన్ టీఎన్జీవోస్‌లో నిర్వహించే సభతో ముగుస్తుందని పేర్కొన్నారు. సోమవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావే శంలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ జిల్లా కార్యలయం నుంచి మహా కార్మిక ప్రదర్శన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీ సభకు ముఖ్య అతిథిగా సీఐటీయూ అఖిలభారత కోశాధికారి ఎం.సాయిబాబు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సభలో భారతదేశ కార్మిక వర్గం స్థితిగతులు, ఎదుర్కొంటున్న సవాళ్లు ఎన్నికల నేపథ్యంలో భారత కార్మిక వరకు నిర్వర్తించాల్సిన కర్తవ్యాల గురించి తెలియజేస్తారన్నారు. ర్యాలీ, బహిరంగ సభకు సీఐటీయూ అనుబంధ రంగాల కార్మికులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఇందులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, జిల్లా కమిటీ సభ్యులు పండుగ పొచ్చన్న, నాయకులు సిరిగిరి దశాంత్, కాడే వినీత్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు

న్యాయవాదులకు రక్షణ చట్టాలను తేవాలి

● ఆదిలాబాద్‌లో విధులు బహిష్కరించి నిరసన

ఆదిలాబాద్ అర్బన్, మే 6: న్యాయాన్ని రక్షించే న్యాయవాదులకు నేడు రక్షణ లేకుండా పోయిందని, అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్టులను తేవాలని ఆదిలాబాద్ బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు ఎర్రాలనగేష్ డిమాండ్ చేశారు. సివిల్ కేసులో తమకు వ్యతిరేకంగా వాదిస్తున్నారనే కక్షతో ఖానాపూర్‌కు చెందిన న్యాయవాది మహేంద్రపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్ మాట్లాడుతూ దేశంలో న్యాయవాదులపై రోజురోజుకు దాడులు పెరుగుతు న్నాయన్నారు. అనేక సందర్భాల్లో న్యాయవాద రక్షణ చట్టం తేవాలని ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నామని తెలిపారు. ఖానాపూర్‌లో న్యాయవాదిపై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్‌చేశారు. న్యాయాన్ని రక్షించే తమకు రక్షణ కల్పించేలా ప్రభుత్వాలు బాధ్యతలు తీసుకుంటు చట్టాలు తేవాలన్నారు. ఇందులో న్యాయ వాదులు, బార్ సభ్యులు పాల్గొన్నారు.



పొచ్చెర క్రాస్ రోడ్ వద్ద మధ్య రోడ్డుపై లారీని నిలిపి ఉంచారిలా..

దర్జాగా నడిరోడ్డుపైనే.. లారీలను నిలుపుతున్న డ్రైవర్లు

● అయినా పట్టించుకోని అధికారులు

బోథ్, మే 6: మండలంలోని అంతర్ రాష్ట్ర రహదారిపై రాత్రిపూట లారీల వారు తమ ఇష్టానుసారంగా వాహనాలను నిలబడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతీరోజు రాత్రి 9 గంటల తర్వాత నడిరోడ్డు పైన పెట్రోల్ బంక్ ఎదురుగా వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. ఫలితంగా మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనించకపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇన్వర్టర్ వైపు వెళ్లే వాహనాలు నడిరోడ్డు పైన నిలిపి ఉంచడంతో ఆదిలాబాద్ నిర్మల్ నుండి వచ్చే వారు ఎదురుగా ఉన్న వచ్చే వాహనాలను గుర్తించలేకపోతున్నారు. ఫలితంగా వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. అర్థరాత్రి నిలిపి ఉంచిన వాహనాల వారిని కట్టడి చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. రాత్రిపూట తిరిగే పెట్రోలింగ్ వాహనాల వారు నడిరోడ్డుపై నిలపకుడా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

కేంద్రం ఏమిచ్చింది అనడం సరికాదు

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

ఉట్నూర్, మే 6: ఎన్నికల ప్రచార సభలలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభ్యర్థుల చేతులలో గాడిదగుడ్డు కాగితాలు పెట్టి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారని, చేతి గుర్తు స్థానంలో గాడిదగుడ్డు వచ్చిందా? అనే ప్రజలు భ్రమపడుతున్నారని ఆదిలాబాద్ శాసన సభ్యుడు పాయల శంకర్ విమర్శించారు. సోమవారం మండలకేంద్రంలోని మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్, నిర్మల్‌లలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారాలలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభ్యర్థుల చేతిలో గాడిదగుడ్డు నమోనా పెట్టి కేంద్రంలో అధికారంలో ఉనర్న ప్రభుత్వాన్ని విమర్శించే ప్రయత్నంలో మాట మాటకి కేంద్రం ఏమిచ్చింది గాడిద గుడ్డు ఇచ్చిందా? అంటూ ప్రకటన చేయడం హేయమైన చర్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ తెలంగాణ ప్రభుత్వానికి రూ.10 లక్షల కోట్లు కేటాయించిందని అన్నారు. ఎంఐఎంతో కలిసి కాంగ్రెస్ పార్టీ కూడా హిందువుల మనోభావాలు దెబ్బతీయడానికి సీతరాముల గురించి వ్యంగ్యంగా మాట్లాడడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ వ్యంగ అస్త్రాలకు హిందువులు బుద్ధి చెబుతారని, హిందువులు రెచ్చిపోయి ఏదైనా చేస్తే కాంగ్రెస్ పార్టీ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాథోడ్ రితేష్, మయూర్‌చంద్ర, అశోక, రాజశేఖర్, దావులే బాలాజీ, కొండేరి రమేష్, కందుకూరి రమేష్, కుటికల ఆశన్న, సాడిగే రాజేశ్వర్, కొమ్ము రామచందర్, శ్రీపతి లింగగౌడ్, బింగి వెంకటేష్, బొడ్డు కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల శంకర్

ఆదిలాబాద్‌లో మాడుపగిలే ఎండలు





ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో నిర్మానుష్యంగా మారిన ఎన్టీఆర్ చౌక్ నుంచి వినాయక్‌చౌక్ వెళ్లే రోడ్డు మార్గం

● భీంపూర్, ఆదిలాబాద్ రూరల్ మండలాల్లో రెడ్ అలర్ట్

ఆదిలాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో మాడుపగిలే ఎండలు దంచికొడుతున్నాయి. పగలంతా భానుడి భగభగలు రాత్రుల్లు తీవ్రమైన ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అసలే మే మాసం కావడంతో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత వారం రోజులుగా 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఆందోళన రేపుతుంది. సోమవారం జిల్లా సగటు గరిష్ట ఉష్ణోగ్రత 44.3 డిగ్రీలు కాగా కనిష్టంగా 26.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా ఆదిలాబాద్‌రూరల్ మండలం పిప్పల్‌ధరిలో 45.8, భీంపూర్‌లో 45.5 గరిష్ట ఉష్ణోగ్రతుల నమోదు కావడంతో ఈ రెండు మండలాల్లో రెడ్‌అలర్ట్‌ను ప్రకటించారు. బేల మండలంలో 44.8, నేరడిగొండలో 43.8, ఆదిలాబాద్‌అర్బన్ 43.0, జైనత్ 42.9, నార్నూర్ 42.1, బజార్‌హత్నూర్ 41.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జనం ఎండతీవ్రతకు అల్లాడుతున్నారు. పశుగ్రాసం కొరత, నీటి ఎద్దడితో మూగ జీవాలు అల్లాడుతున్నాయి. ఎండల తీవ్రతకు చిరు వ్యాపారులు ఇబ్బందుల పాలవుతున్నారు. గిరాకీలు భారీగా పడిపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. ఏసీలు, కూలర్స్, ఫ్రిడ్జ్‌ల గిరాకి భారీగా పెరిగింది. ఉదయం, సాయంత్రం వేళల్లోనే పనులు ముగించుకుని ఇంటికి తిరుగు ముఖం పడుతున్నారు. కరెంట్ కోతలతో భరించలేని ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గ్రామాల్లో పరిసర ప్రాంతాల్లో ఉన్న చెట్లకిందనే సేద తీరుతున్నారు. రాత్రి వేళల్లో కూడా ఆరుబయట ఇంటి దాబాల పై కునుకు తీస్తున్నారు. తీవ్రమైన ఉక్కపోత వేడి గాలులతో నిద్ర కూడా సరిగా పట్టడం లేదని పలువురు వాపోతున్నారు.

వర్గీకరణ విషయంలో మాదిగలకు అన్యాయం

● ఆదిలాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, మే 6: బీజేపీ ప్రభుత్వం మాదిగలకు అన్యాయం చేసిందని, ఈ లోక్‌సభ ఎన్నికలలో ఆ పార్టీకి సరైన బుద్ధి చెప్పాలని ఆదిలాబాద్



మాట్లాడుతున్న ఆదిలాబాద్ కాంగ్రెస్ నేత కంది శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ప్రజాసేవ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి తమ మద్దతు తెలుపుతున్నట్లు మాదిగ సంఘ నాయకులు తెలుపగా.. ఆయన హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వర్గీకరణ విషయంలో మాదిగలకు అన్యాయం చేసిన బీజేపీకి మాదిగల ఒక్క ఓటు కూడా పడకుండా ఆ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. బడుగు బలహీన వర్గాలు, దళితుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. మాదిగలు ఆర్థికంగా ఎదగడానికి ఎంతో తోడ్పాటునందించిందని, దళితుల సంక్షేమాన్ని కాంక్షించే నాయకులు బీజేపీ, బీఆర్‌ఎస్‌ల పంచాన చేరడం సరికాదని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. మాదిగ సంఘ నాయకులు తమ తమ ప్రాంతాలలో కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రచారం చేసి ఎంపీ అభ్యర్థి ఆత్రంసుగుణ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాలమనోజ్ మాదిగ,మాదిగాజేఏసీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ మోతే భారికరావు మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుల నక్క రాందాస్ మాదిగ, బిక్కి గంగాధర్, గాలిపెల్లి నాగన్న, ప్రసన్న కుమార్, మంతెన సోనియా, అలకొండ గంగాధర్, ముక్కెర అశోక్, కత్తి గంగాధర్, నలిగంటి మహేష్, కోరాటి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

● ఉపాధిహామీ కూలీలతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

బోథ్, మే 6: ఉపాధి హామీ కూలీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎలాంటి ఆందోళన చెందవద్దని కేంద్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలో పెట్టిన విధంగా కూలీ రేటు 400 రూపాయలు పెంచడం జరుగుతుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పేర్కొన్నారు. సోమవారం ఏఐసీసీ విద్యార్థి రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్‌కుమార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉపాధి హామీ కూలీలను కలిశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలు తమ కష్టాన్ని వివరించారు. అయితే వెంటనే సెల్ ఫోన్లో అరుణ్ కుమార్ మంత్రి సీతక్క తో కూలీలను మాట్లాడించడం జరిగింది. ఈ సందర్భంగా కూలీలు మండుటెండలో కష్టం చేస్తున్న గిటుబాటు కావడం లేదని మంత్రికి వివరించారు. మండుటెండల్లో పనులు చేస్తున్నామని అయినా కూలి రేట్లు లేకపోవడంతో తక్కువ వస్తున్నాయన్నారు. కేంద్రంలో తమ పార్టీ అధికారంలోకి రాగానే కూలీరేట్లు 400 పెంచడం జరుగుతుందని ఉపాధి హామీ కూలీలకు తాము అండగా ఉంటామని మంత్రి వివరించారు. అందుకుగాను పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని మంత్రి కూలీలకు వివరించడం జరిగింది. కూలీలతో మంత్రి మాట్లాడడంతో కూలీలు సంతోషపడ్డారు. మంత్రి సైతం కూలీలను అక్కా అని సంబోధించడంతో కూలీలు మంత్రిని అక్క అని సంబోదించారు. మంత్రి మాట్లాడిన తీరు కూలీలను ఎంతగానో ఆకట్టుకుంది.

‘గొర్రెలు ఇస్తామని మోసం చేశారు.. అందుకే బీఆర్‌ఎస్ నుంచి వెళ్తున్నాం’

తలమడుగు, మే 6: యాదవ కురుమ కులస్థులకు గొర్రెలు ఇస్తామని మోసం చేసిందని అందుకే బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని బరంపూర్‌యాదవ సంఘం నాయకులు సంపత్‌సుదం అన్నారు. సోమవారం ఆయనతో పాటు పలువురు యాదవ సంఘం నాయకులు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి తలమడుగు జడ్పీటీసీ గోకగణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణలక్ష్మి రాజేశ్వర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ కండువ కప్పుకొని కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు సుదాం మాట్లాడుతూ యాదవులకు కురుమ కులస్థులకు గొర్రెలు పంపిణీ చేస్తామని చెప్పి ఒక్కొక్కరి దగ్గర 35వేల డీడీ రూపాయలను కట్టించుకుని ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. డీడీ డబ్బుల కోసం అప్పులు చేసి కట్టినప్పటికి ఇప్పటి వరకు గొర్రెల పంపిణీ చేయలేదన్నారు.

అందుకే టీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి రైతుల సంక్షేమ కోసం మహిళల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశ పెడుతున్న సంక్షేమఅభివృద్ధి పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని ఆయన తెలిపారు. ఇందులో మాజీ జడ్పీటీసీ బాపన్న, ప్రతాప్ ప్రకాష్‌రావు, నారాయణ, పోశెట్టి దేవన్న, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రోజుల్లో పనులు పూర్తి చేయాలి

ఆసిఫాబాద్, మే 6: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులలో భాగంగా పోలింగ్‌కేంద్రాలు కలిగిన పాఠశా లల్లో పనులను నాలుగు రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా ఎన్ని కల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశ మందిరంలో అదనపుకలెక్టర్ దీపక్ తివారి, డీఈవో అశోక్‌తో కలిసి విద్యా శాఖాధికారులు, ఎన్నికల నోడల్ అధికా రులు, పంచాయతీ, గిరిజన సంక్షేమశాఖ అధికారులు, ఇంజినీరింగ్ విభాగం అధికా రులతో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సిర్పూర్, ఆసిఫా బాద్ అసెంబ్లీనియోజకవర్గాల్లో ఈనెల 13న జరుగనున్న లోక్‌సభ పోలింగ్ కొరకు జిల్లా లో అమ్మఆదర్శ పాఠశాలలకు ప్రాధాన్యత ఇచ్చి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుదీ కరణ, ఫ్యాన్లు, తాగునీరు, మూత్రశాలలు, ర్యాం పుల నిర్మాణం పనులు వేగవంతంగా చేయాలన్నారు. పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పా ట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే

సింబల్ లోడింగ్ యూనిట్ల స్టోరేజ్ గదిని పరిశీలించిన కలెక్టర్

సింబల్ లోడింగ్ యూనిట్ల స్టోరేజ్ గది వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు తీసు కుంటామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకటేష్ దోత్రే అన్నారు. సోమ వారం కలెక్టరేట్‌లోని స్టోరేజీ గదిలో భద్రపరిచిన సింబల్ లోడింగ్ యూనిట్లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, సిర్పూర్ సహాయ ఎన్నికల అధికారి దీపక్ తివారి, ఆసిఫాబాద్ సహాయ ఎన్నికల అధికారి దాసరి వేణుతో కలిసి పరిశీలిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల కమిషనింగ్ ఉపయోగించిన సింబల్ లోడింగ్ యూనిట్లను స్టోరేజీ గదిలో భద్రపరిచి గదికి సీలు వేశామని తెలిపారు. స్టోరేజీ వద్ద భద్రత పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీసీ కెమెరాలను నిత్యం పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశిం చారు.

కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ మధుకర్, నాయబ్ తహసీల్దార్ జితేందర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

బెజ్జూరులో తునికాకు సేకరణ ప్రారంభం

బెజ్జూరు/చింతలమానేపల్లి, మే 6: బెజ్జూరు రేంజ్ పరిధిలోని పలు గ్రామాల్లో, చింతలమానే పల్లి మండలం కర్జెల్లి రేంజ్ పరిధిలో సోమవారం కర్జవెల్లితో పాటు పలు గ్రామాల్లో తునికాకు సేకరణ ప్రారంభమైంది. వేసవి పంటగా భావించే తునికాకు సేక రణతో కూలీలు ఆర్థికంగా లబ్ధి పొందే అవకాశం ఉంది. గ్రామా ల్లో వేకువజామున అటవీప్రాంతా నికి వెళ్లి తునికాకు సేకరించి కట్టలు కట్టికల్లాల్లో విక్రయి స్తారు. ప్రతిఏటా మే మొదటి వారం రోజులు తునికాకు సేకరణ ప్రారంభమవుతుంది. కాగా కొన్నేళ్లుగా కట్టధర పెంచాలని కూలీలు చెబుతు న్నప్పటికీ ప్రభుత్వం పట్టించు కోవడం లేదని కూలీలు పేర్కొంటున్నారు. ఈ తుని కాకు సేకరణ నెల రోజు పాటు సాగనుంది.



మానీ లాండరింగ్ కేసు వెనక మర్మమేమిటి?

● ఇటీవల ఒకరిపై కేసు నమోదు
● భారీ లావాదేవీలు జరిగినట్లు సమాచారం
● స్థానిక పోలీసులపై పలు అనుమానాలు?

నేరడిగొండ, మే 6: ఇటీవల మండల కేంద్రంలో పోలీసులు నలుగురు వ్యాపారుల వద్ద తనిఖీలు చేపట్టారు. అయితే ఆ తనిఖీల్లో ఓ వ్యాపారి పై మనిలాండరింగ్ కేసు నమోదు చేసినట్లు సమాచారం.అయితే ఈ మని లాండరింగ్ కేసు వెనుక మరమ మేమిటో తెలియడం లేదు. దీంతో ప్రజలు స్థానికపోలీసుల పై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బడా వ్యాపారుల వద్ద భారీగా లావాదేవీలు జరిగినట్లు ప్రచారం సాగుతుంది. అయితే ఈ విషయంలో గోప్యత పాటించడం పట్ల మామూలుగా తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ విషయమై నేరడిగొండ ఎస్సై శ్రీకాంత్‌ను వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

వేసవి దుక్కులతోనే అధిక లాభాలు : ఏవో రవీందర్

తాంసి, మే 3: వేసవిలో దుక్కలు దున్నడం వల్ల వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి రవీందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రబీ పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు నిర్ధారించిన విత్తనాలను మాత్రమే వేసుకోవాలి, మోతాదుకు మించి పురుగు మందులు వాడటం వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉండవు అన్న విషయాన్ని ప్రతి రైతు గమనించాలన్నారు. ముఖ్యంగా పంట మార్పిడి విధానంతో అధిక దిగుబడులు సాధ్యమవుతాయని అన్నారు. ప్రతి రైతు ఆతుడి పంటలపై శ్రద్ధ వహించాలని కోరారు. ముఖ్యంగా సమయానికి ఎరువులు, పురుగు మందులు వాడాలని కోరారు. వేసవి దుక్కలలో పశువుల ఎరువును వేసినట్లయితే ఆది పంటలకు మంచి ఫలితాన్ని అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఖరీఫ్‌లో వేసే ఆయా పంటలకు సంబంధించి సాగు విధానం గురించి రైతులకు వివరించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బోథ్, మే 6: మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ వెంకటరమణ తల్లి ఇటీవల మృతి చెందడంతో సోమవారం స్థానిక శాసనసభ్యుడు జాదవ్ అనిల్ పరామర్శించారు. ఆమె మృతి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ తుల శ్రీనివాస్‌తో పాటు పలు గ్రామాల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.



కనుగుట్ట గ్రామంలో మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

పెట్రోల్‌లో కల్తీ ఉందంటూ వినియోగదారుని ఆరోపణ

బోథ్, మే 6 : మండలంలోని కౌటా(బి) కనుగుట్ట గ్రామాల మధ్య ఉన్న పెట్రోల్ బంక్‌లో తనకు కల్తీ పెట్రోల్ పోయడం జరిగిందని కనుగుట్ట గ్రామానికి చెందిన ఈదాపు భోజారెడ్డి అనే వ్యక్తి ఆరోపించారు. తాను ఆదివారం ఉదయం బంకులో పెట్రోల్ పోయించుకున్నారని ఇంటి వరకు వెళ్లిన తన వాహనం మొరాయించిందని ఆరోపించారు. దీంతో తాను బోథ్‌లోని షోరూమ్‌కు తీసుకువెళ్లి చూపించగా అక్కడి మెకానిక్‌లు పెట్రోల్ ట్యాంక్‌లో ఉన్న పెట్రోల్ మొత్తం తీసి బాటిల్లో నింపడం జరిగిందన్నారు. కల్తీ పెట్రోల్ వల్ల ఈ విధమైన ఇబ్బంది ఏర్పడిందని తెలపడం జరిగిందని వినియోగదారుడు పేర్కొన్నారు. చివరకు పెట్రోల్ బాటిల్ తీసుకుని తాను కొనుగోలు చేసిన పంపుకు తెల్లగా అక్కడి వారు తాము కల్తీ చేయలేదని కావాలంటే టెస్ట్ చేసి చూపిస్తామంటూ పేర్కొనడం జరిగిందన్నారు. తనకు జరిగిన నష్టం ఎవరూ భర్తీ చేస్తారని వినియోగదారుడు వాపోయారు. ఈ విషయమై సంబంధిత బంకు యజమానిని వివరణ కోరగా ఇందులో తమ తప్పేమి లేదని వచ్చిన పెట్రోల్‌ను విక్రయించడం జరిగిందని అనుమానం ఉంటే ఫిర్యాదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.


మోదీతోనే అభివృద్ధి సాధ్యం

● బీజేఎల్పీ నేత ఏలేటి

సారంగాపూర్, మే 6 : పీఎం నరేంద్ర మోదీతోనే దేశం అభివృద్ధి చెందడం సాధ్యమవుతుందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలని చించోలి(బి), జాం గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత పీఎం నరేంద్ర మోదీకి దక్కిందన్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు నిరుపేదలకు ప్రతి రోజు ఉపాధి హామీ పథకంలో పని కల్పించడంతో పాటు వెంటదివెంటనే కూలీల డబ్బులను బ్యాంకు ఖాతాలలో జమ చేయడం జరుగుతుందన్నారు. జరగబోయే ఎన్నికల్లో బీజేపీ పార్టీని మూడోసారి దేశంలో అధికారంలోకి వచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేసి, బీజేపీ అధికారంలోకి తీసుకురావాలని ఆయన ఉపాధి హామీ కూలీలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ గౌడ్, కరిపే విలాస్, రాంశంకర్ రెడ్డి, చంద్రప్రకాష్ గౌడ్, సాహెబ్ రావు, గంగారెడ్డి, రాజేశ్వర్, బడి పోతన్న, తిరుమల చారిలతో పాటు నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

కౌటాల, మే 6: మండలంలోని గురుడుపేట గ్రామానికి చెందిన బొగరపు భీంరావు(35) జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి కమల, ఎస్సై మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం.. భీంరావుకు అదేగ్రామానికి చెందిన సౌజన్యతో 12ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కొంతకాలంగా భీంరావు మద్యంకు బానిస కావడంతో భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సౌజన్య తన తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. దీంతో భీంరావు ఆదివారం రాత్రి సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్యకు యత్నించగా స్థానికులు అతనికి నచ్చచెప్పి కిందికి దించారు. అదేరోజురాత్రి మళ్లీ టవర్‌ఎక్కి ఆత్మహత్యాయత్నంకు పాల్పడగా ప్రమాదవశాత్తు కిందపడడంతో తలకు బలమైన గాయాలవలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఉదయం గ్రామానికి చెందిన చిన్నయ్య చూసి కుటుంబీకులకు సమాచారం అందించాడు. మృతుడితల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



కుల సంఘాలకు.. గాలం!



- జిల్లాలో కులపెద్దలతో మంతనాలు జరుపుతున్న నేతలు
- ఆయా సంఘాల నేతలకు పెరుగుతున్న రాజకీయ ప్రాధాన్యత
- అభివృద్ధి, సంక్షేమ హామీలతో తమవైపు తిప్పుకునే ప్రయత్నం
- గెలుపు ధీమాలో ప్రధాన పార్టీల అభ్యర్థులు
- జిల్లావ్యాప్తంగా సమీపిస్తున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రసవత్తరంగా మారుతున్న రాజకీయాలు

ఆదిలాబాద్, మే 6(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో విజయాన్ని సాధించేందుకు ప్రధాన పార్టీలు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. ముఖ్యంగా కుల సంఘాల ఓట్లను రాబట్టేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టాయి. లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు మరో ఏడు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. దీంతో ఏ సామాజిక వర్గం.. ఎవరికి మద్దతుగా నిలుస్తుందో?నని అంచనా వేసుకుంటూ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. సరికొత్త హామీలతో సామాజిక వర్గాల వారీగా ఓటర్లకు గాలం వేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే పార్టీలన్నీ కుల సంఘాలకు ఎనలేని ప్రాధాన్యతను ఇస్తున్న విషయం తెలిసిందే. అడిగిన వెంటనే అన్ని వర్గాల వారికి సంఘ భవనాల నిర్మాణానికి భారీ నిధులు కేటాయించేస్తున్నారు. ప్రధానంగా లోక్‌సభ ఎన్నికల గడువు ముంచుకొస్తుండడంతో కులాల వారీగా సభలు, సమావేశాలను ఏర్పాటు చేస్తూ వారి సంక్షేమానికి నిధులు కేటాయిస్తామని హామీలు గుప్పిస్తున్నారు. రాబోయే రోజుల్లో అదనపు నిధులు కేటాయించి అభివృద్ధికి బాటలు వేస్తామని అదరగొట్టే ప్రసంగాలు చేస్తున్నారు. ముఖ్యంగా మెజార్టీ కుల సంఘాల ఓట్లను రాబట్టే విధంగా వ్యూహ రచన చేస్తున్నారు. ఆదివాసీల ఉద్యమానికి అండగా నిలుస్తామంటూ ఆ సామాజిక వర్గం ఓట్లను తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఆదివాసీల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని కాంగ్రెస్ పేర్కొంటుంది. ఆదివాసీల సమస్యలు కేంద్ర ప్రభుత్వం చొరవతోనే పరిష్కారమవుతాయని బీజేపీ గట్టిగా చెప్పే ప్రయత్నం చేస్తోంది. అంతేకాకుండా లోక్‌సభ ఎన్నికల్లో గెలిపిస్తే ఆదివాసీల సమస్యకు సరైన పరిష్కారం చూపుతామని చెప్పే ప్రయత్నాలు చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల పుణ్యమా అంటూ కుల సంఘాల నేతలకు భలే డిమాండ్ ఏర్పడింది. పార్టీల ముఖ్య నేతలంతా ఫోన్లు చేస్తూ.. తమ పార్టీ అభ్యర్థికే మద్దతును ఇవ్వాలంటూ కోరుతున్నారు.

కుల పెద్దలకు ప్రాధాన్యత

మంచి పరిచయాలు, పలుకుబడి ఉన్న సంఘ పెద్దల జాబితాను సిద్ధం చేసుకుంటూ తరుచుగా వారితో టచ్‌లో ఉంటూ నేతలు మంతనాలు జరుపుతున్నారు. ముఖ్య సంఘ నేతలతో సమావేశమవుతూ



మద్దతుగా నిలువాలని కోరుతున్నారు. కుల పెద్దల వ్యక్తిగత సమస్యలతో పాటు సంఘాలకు కావాల్సిన అవసరాలను తీర్చేందుకు సిద్ధమవుతున్నారు. అదేవిధంగా ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలోని నియోజక వర్గాల వారీగా అనుభవజ్ఞులైన నేతల కు ఇన్‌చార్జీ బాధ్యతలను అప్పగించి రోజువారి పరిస్థితిని పరిశీలిస్తున్నారు. ఇతర పార్టీల ఎత్తుగడలను ఎప్పటికప్పుడు పసిగడుతూ కుల పెద్దలు చేజారి పోకుండా జాగ్రత్త పడుతున్నారు. ఏదైనా తేడా వస్తే అభ్యర్థులు, ఎమ్మెల్యేలు నేరుగా ఫోన్‌లో మాట్లాడుతూ సెటిల్ చేస్తున్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేది తామేనంటూ ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తూ సంఘ నేతల్లో భరోసా నింపే ప్రయత్నం చేస్తున్నారు. సంఘాల పేరిట.. కొందరు కుల పెద్దలే లబ్ధి పొందుతున్నారన్న విమర్శల తో అక్కడక్కడ చిన్నపాటి ఘర్షణలు కూడా చోటు చేసుకుంటున్నాయి. కొన్నిచోట్ల సంఘ నేతలపై స్థానిక సభ్యులు మండిపడుతున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా రహస్యంగా కుల పెద్దలతో సంప్రదింపులు జరుపుతున్నారు.

అధికార పార్టీ జోరు

ఎన్నికల ప్రచారం తుది దశకు చేరుకోవడంతో అధికార పార్టీ మరింత జోరు పెంచుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలపై ప్రచారాన్ని ముమ్మరం చేస్తోంది. ఇప్పటికే కొన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని.. రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలకు రూపకల్పన చేస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. కాగా, అమలుకు నోచుకోని హామీలను నిలదీయాలంటూ ప్రతిపక్షాలు పిలుపునిస్తున్నాయి. అయితే కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే కేంద్రంలో చక్రం తిప్పి లోక్‌సభ పరిధిలో అభివృద్ధిని చేపడతామని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల వెనుక ఎంతో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని బీఆర్‌ఎస్, బీజేపీలు విమర్శ నాస్త్రాలు విసురుతున్నాయి. ఏ పార్టీ నేతలైనా తమ సొంత సామాజిక వర్గానికి చెందిన వారికే ఎక్కువగా ప్రాధాన్యతను ఇస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అదేవిధంగా పార్టీ పదవులతో పాటు ప్రభుత్వ పథకాల్లో వారికే పెద్దపీట వేయడంపై కొన్నివర్గాల్లో అసంతృప్తి కనిపిస్తుంది. లోక్‌సభ ఎన్నికల్లో సైతం జిల్లా రాజకీయాలు కుల, సామాజిక వర్గాల చుట్టే తిరగడంపై రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

లంబాడాల మద్దతు ఎవరికి?

లోక్‌సభ బరిలో ఉన్న ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆదివాసీలే కావడంతో లంబాడాల మద్దతు ఎవరికన్నది ప్రధాన చర్చనీయాంశంగా మారింది. వీరి మద్దతుపై సర్వత్రా ఆసక్తి కనిపిస్తోంది. ఈసారి ఎన్నికల బరిలో ప్రధాన పార్టీల నుంచి లంబాడా సామాజిక వర్గానికి చెందిన నేతలెవరూ లేకపోవడంతో వారి మద్దతుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సామాజిక వర్గానికి చెందిన స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచిన వారికి మద్దతునిచ్చే విషయమై స్పష్టత కనిపించడం లేదు. ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఎవరికీ పూర్తిస్థాయిలో మద్దతు దక్కే అవకాశం లేదు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఆత్రం సక్కు, ఆత్రం సుగుణ గతంలో ఆదివాసీ ఉద్యమంలో కీలకపాత్ర పోషించడంతో కొంత మంది లంబాడా సామాజిక వర్గానికి చెందిన నేతలు, ఓటర్లు బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తుంది. అయితే అన్ని పార్టీలలో లంబాడా నేతలు కీలకం కావడంతో తమ పార్టీల అభ్యర్థుల గెలుపు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. దాదాపుగా లోక్‌సభ పరిధిలో లంబాడా సామాజిక వర్గానికి చెందిన ఓట్లు లక్షా 50వేల వరకు ఉంటాయని అంచనా వేస్తున్నారు. మెజార్టీ ఓట్లను రాబట్టేందుకు అన్ని పార్టీల నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.


వివరాలు అడిగి తెలుసుకున్న కుడ్మెత మనోహర్

వేసవిలో ప్రజల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి : అదనపు డీఎంహెచ్‌వో

ఇంద్రవెల్లి, మే 6: వేసవిలో గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వైద్యం అందించాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో కుడ్మెత మనోహర్ అన్నారు. సోమవారం మండలంలోని దోడందా, ఈశ్వర్‌నగర్ గ్రామాల్లో ఏర్పాటు మల్టీ స్పెషల్టీ డైగ్నోటిక్స్ మొబైల్ మినీ హాస్పిటల్, మెడికల్ క్యాంప్ పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడి ప్రజల ఆరోగ్యం, గర్భిణులు, బాలింతలు, స్ర్తీల ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రస్తుతం ఎండలు దంచికొడుతున్నాయని, అవసరం ఉంటే తప్ప అనవసరంగా బయటకు రావద్దన్నారు. ముఖ్యమైన పనులు ఉంటే ఉదయం, సాయంత్రం సమయాల్లో చేయాలన్నారు. అనంతరం ఎండి జనరల్ సర్జన్ సాయినాథ్, గైనకాలజిస్టు అంరిన్, షరీఫ్, వైద్యుడు శ్రీకాంత్, సందీప్, తులసి దాస్‌ల ఆధ్వర్యంలో రోగులకు, గర్భిణీ, బాలింత స్ర్తీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న రోగులను ఆదిలాబాద్ రిమ్స్‌కు రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు శ్రీకాంత్, హెచ్‌ఈవో జ్యోతి, పీహెచ్‌ఎన్ శ్రీనివాస్, లక్ష్మీ, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న రిమ్స్ డైరెక్టర్ డా.జైసింగ్‌రాథోడ్

రిమ్స్ సూపర్ స్పెషాలిటీలో మెరుగైన సేవలు : డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్ అర్బన్, మే 6: రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలను అందిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్‌రాథోడ్ తెలిపారు. సోమవారం జిల్లాకేంద్రంలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీనిలో భాగంగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో న్యూ పిడియాట్రిక్, అంకో సర్జన్లతో పాటు కార్డియాలజి వైద్యులు ఓపీలో ఉన్నారన్నారు. త్వరలోనే క్యాథ్ ల్యాబ్‌తో పాటు ఎంఆర్‌ఐని ప్రారంభిస్తామని తెలిపారు. రిమ్స్‌లో ప్రస్తుతం వంద మంది వైద్య విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, దాన్ని 170 వరకు పెంచడంతో పాటు పీజీ సీట్లు పెంచేలా నివేదికలు పెట్టామన్నారు. వైద్యుల కొరతను పూర్తిస్థాయిలో తగ్గిస్తామన్నారు. ఇటీవల ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు తండ్రికి క్యాన్సర్ చికిత్సలు, సర్జరి చేశామన్నారు. ప్రస్తుతం అయన పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఆదిలాబాద్ నుంచి ఏఒక్క రోగి కూడా రెఫర్ కాకుండా వైద్య సేవలను అందిస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఇందులో వైద్యులు, తదిరులున్నారు.

‘పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ స్లిప్‌ల పంపిణీ’

ఆదిలాబాద్ అర్బన్, మే 6: ఓటర్ స్లిప్‌ల పంపిణీ ప్రతీ పోలింగ్ కేంద్రంలో బూత్ స్థాయి అధికారి ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని ఆర్డీవో వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన జిల్లాకేంద్రంలో మాట్లాడుతూ.. ఓటర్ స్లిప్‌లు తీసుకోని వారు ఈ నెల 7, 8వ తేదీలలో స్థానిక బూత్ స్థాయి అధికారిని సంప్రదించి తీసుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. అంతేకాకుండా ఓటర్లు ఎక్కడైతే మీ ఓటును వినియోగించుకుంటారో.. ఆ కేంద్రం వద్దనే బూత్ లెవల్ అధికారి పేరు, సెల్ నెంబర్, తదితర వివరాలు అందుబాటులో ఉన్నాయని, వారి ద్వారా సమాచారం సేకరించి, ఓటర్ స్లిప్‌లను తీసుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు రెండు రోజులే సమయం ఉందని ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, పోలీసు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది తమ ఓటు హక్కును 7, 8వ తేదీలలో వినియోగించుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా 1,514 మంది వినియోగించుకున్నారని తెలిపారు. రాంనగర్, షాద్‌నగర్, వాఘాపూర్, టీచర్స్‌కాలనీ, న్యూహౌజింగ్‌బోర్డు, పిట్టలవాడ కాలనీలలో.. ఇంకా ఓటర్ స్లిప్‌లు తీసుకోని వారు ఆయా పోలింగ్ కేంద్రాలలో సంప్రదించి తీసుకోవాలని పేర్కొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న అత్యవసర సేవల సిబ్బంది

ఆదిలాబాద్ అర్బన్, మే 6: జిల్లా కలెక్టరేట్‌లోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఓటు హక్కును అత్యవసర సేవల శాఖల ఉద్యోగులు, పత్రిక పాత్రికేయులు వినియోగించుకున్నారు.ఈ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న జిల్లా పౌర సంబంధాల అధికారిణి తిరుమల, అగ్నిమాపక శాఖ అధికారి రమాకాంత్, పాత్రికేయులు శ్రీకాంత్‌లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి : జిల్లా అధ్యక్షుడు

ఆదిలాబాద్ అర్బన్, మే 6: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు వెంటనే ఎస్సీ ఉప కులాల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఎస్సీ ఉప కులాల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జాదవ్‌శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిలాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీనిలో భాగంగా ఈ దఫా ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఎస్సీ ఉప కులాల హక్కుల పోరాట సమితి మద్దతు ఉంటుందని, కానీ ఉపకులాల సమస్యలపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలని కోరారు.

‘ఒక్కరైతు వద్ద 12 క్వింటాళ్ల జొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి’

జైనథ్, మే 6: జిల్లాలో సాగైన జొన్న పంట అధిక దిగుబడులను దృష్టిలో ఉంచుకొని ప్రతీఒక్క జొన్న రైతు నుంచి 12 క్వింటాళ్ల వరకు ప్రభుత్వం జొన్న పంటను కొనుగోలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జైనథ్ మండల అధ్యక్షుడు ఏనుగు రాకేష్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన జైనథ్‌లో జైనథ్ మండల జొన్న రైతులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వం జొన్న పంట కొనుగోళ్లను ఎనిమిది క్వింటాళ్ల 85 కిలోల నుంచి 12 క్వింటాళ్ల వరకు పెంచాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జైనథ్ మండలంతో పాటు జిల్లావ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు సిడాం రాకేష్, పొచ్చన్న, సురేష్‌రెడ్డి, అశోక్, వికాస్, వినోద్, తరుణ్‌లతో పాటు జైనథ్ మండలంలోని ఆయా గ్రామాల జొన్న రైతులు పాల్గొన్నారు.

‘ప్రజాప్రతినిధులను నిలదీయండి’

ఉట్నూర్, మే 6: పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని ఓట్ల కోసం గ్రామాలకు వస్తున్న ప్రజా ప్రతినిధులను నిలదీయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సిడాంజంగేవ్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలు అందిస్తామంటూ ప్రతి ఎన్నికల్లో ప్రజలను నాయకులు మోసగిస్తున్నారని విమర్శించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు, విద్యుత్,వైద్యం, మంచినీరు లాంటి కనీస సౌకర్యాలు అందడం లేదన్నారు. సంక్షేమ కార్యక్రమాలు అందక ఆదివాసీ గ్రామాల ప్రజలు ఇంకా అభివృద్ధికి దూరంగానే ఉన్నారని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని, ఇంటర్ చదువు పూర్తి చేసి డిగ్రీ చదువుకునే గిరిజన విద్యార్థులకు అవకాశాలు కల్పించాలన్నారు. ఆశ్రమం పాఠశాలలకుమౌళిక వసతులు కల్పించి ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు విద్య, వైద్య సౌకర్యాలు ఉచితంగా అందించాలన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో మోహన్‌రెడ్డి

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే.. చర్యలు తప్పవు : ఎంపీడీవో

తాంసి, మే 3: మండలంలోని ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు విధుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల అధికారులు, కారోబార్లతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అధికారి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజాపాలనలో ఇచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా గృహలక్ష్మీ పథకంలో దరఖాస్తు చేసినప్పటికీ జీరో బిల్లు రాని విద్యుత్ వినియోగదారులు తమ డాక్యుమెంట్లను మండల పరిషత్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. గృహలక్ష్మీ లబ్ధిదారులు తప్పనిసరిగా రేషన్‌కార్డులో పేరు నమోదై ఉండాలని, పారిశుధ్యం పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఉపాధి పనికి వచ్చే ప్రతీఒక్కరికి జాబ్ కార్డును అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇందులో సూపరింటెండెంట్ రవీందర్, అధికారులు సంపూర్ణ, ఏపీవో విజయ, పుష్ప, తదితరులు ఉన్నారు.

పట్టుదలతో చదవాలి..
ఉన్నత లక్ష్యాన్ని సాధించాలి

- జిల్లా కలెక్టర్ రాజార్షిషా
- ‘పది’ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం
- హాజరైన డీఈవో, ఉపాధ్యాయులు


పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభను సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా


ప్రశంసా పత్రాలు అందుకుంటున్న బోథ్ విద్యార్థులు

ఆదిలాబాద్ అర్బన్, మే 6: విద్యార్థి దశ నుంచే అత్యున్నత లక్ష్యాలను సాధించాలన్న పట్టుదలతో చదవాలని, తద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సోమవారం ఘనంగా సన్మానిచారు. పట్టణంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదికి పది జీపీఏ సాధించిన పలువురు విద్యార్థులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అదేవిధంగా విద్యార్థులకు దిశానిర్దేశం చేసి ప్రోత్సహించిన ఉపాధ్యాయులను సైతం సన్మానించారు. అనంతరం కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు విద్యార్థి దశలో అత్యంత కీలకమని, ఇందులో ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులకు సరైన మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయుల పనితీరు పట్ల ప్రశంసలు కురిపించారు. పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను, ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహిస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని తెలిపారు. తల్లిదండ్రులు సైతం విద్యార్థుల ఉన్నతిలో తమవంతు పాత్ర పోషించాలన్నారు. జీవితంలో ఉన్నతంగా స్థిరపడిన వారిని ఆదర్శంగా తీసుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్య శాఖాధికారి ప్రణీత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాలు 10 జీపీఏ సాధించిన మండలకేంద్రంలోని గురుకుల, మోడల్ పాఠశాలల విద్యార్థులకు కలెక్టర్ రాజార్షిషా సోమవారం ప్రశంస పత్రాలను అందజేసినట్లు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధించాలని, లక్ష్యాన్ని సాధించి ఉన్నతస్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించినట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు.

నిర్లక్ష్యానికి మూల్యం.. నిండు ప్రాణాలు!

- ఇచ్చోడలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ప్రైవేటు వాహనదారులు
- అయినా ప్రేక్షకపాత్ర వహిస్తున్న అధికార యంత్రాంగం
- ఆటోలు, వ్యాన్‌ల కట్టడిలో పోలీసు, రవాణా అధికారుల వైఫల్యం

ఇచ్చోడ, మే 6: ఆటోలు, వ్యాన్‌ల నిర్వహణలో నిబంధనల ఉల్లంఘన యథేచ్ఛగా కొనసాగుతోంది. పోలీసు, రవాణా శాఖ అధికారుల నిర్లక్ష్యం మరో ప్రమాదానికి దారితీసింది. ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ వైపు వెళ్లే ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణిస్తున్న ఆయా శాఖల అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ప్రధాన రహదారిపై వ్యాన్‌లల్లో ప్రయాణికుల్ని పరిమితికి మించి నింపిన రవాణా అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. రహదారిపై ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నా.. వాహనదారులు మాత్రం ఎలాంటి జాగ్రత్త చర్యలు చేపట్టడం లేదు. ప్రయాణికులు తావ గమ్యస్థానానికి చేరాలనే తొందరలో రోడ్డు భద్రత నియమాలు గాలికొదేలేసి ప్రమాదకర ప్రయాణాలను కొనసాగిస్తున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరకముందే అధికారులు మేల్కొని ఇటు వాహనదారులకు.. అటు ప్రయాణికులు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టి మారుమూల గ్రామప్రజలను చైతన్యవంతుల్ని చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనికి తోడు జాతీయ రహదారిపై ఆటోలను నడపకూడదన్న నిబంధన ఉన్నా జిల్లాలో ఎక్కడ అమలు జరగడంలేదు. పలుచోట్ల కిక్కిరిసిన ప్రయాణికులతో ఆటోలు జాతీయ రహదారిపై ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఆటోల్లో 15మంది వరకు, వ్యాన్లల్లో వంద మందికి పైగా ప్రయాణిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని, అదేవిధంగా ఆటోల్లో, వ్యాన్లల్లో నిబంధనల ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు.


ఆటో టాప్‌పైకి ఎక్కి ప్రయాణిస్తున్న దృశ్యం



జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారిలా..